



స్థానిక వైసీపీకి బీటలు

- కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో కూటమి వైపు చూస్తున్న వైసీపీ కౌన్సిలర్లు
- ఇప్పటికే పలువురు టీడీపీ, బీజేపీలో చేరిక
- ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో పట్టు బిగిస్తున్న టీడీపీ
- పసుపు జెండా నీడన చేరిన ఐదుగురు కౌన్సిలర్లు
- చైర్మన్ సహా మరో ఏడుగురు త్వరలో చేరిక?
- కర్నూలు మేయర్ పీఠం చేజారేనా?

కర్నూలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైనాట్ 175.. అన్న జగన్‌కు ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో ఊహించని ఝలక్ ఇచ్చారు. ఆ షాక్ నుంచి తేరుకోక ముందే ఆ పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు టీడీపీ వైపు చూస్తున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఇప్పటికే పలువురు పార్టీ కండువాలు మార్చుకోగా.. మరికొందరు ఆ ప్రయత్నాల్లో ఉన్నారు. కర్నూలు కార్పొరేషన్‌లో ఆరుగురు వైసీపీ కార్పొరేటర్లు మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరితే.. ఆదోని మున్సిపాలిటీలో ముగ్గురు కౌన్సిలర్లు, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆధ్వర్యంలో వైసీపీని వీడి బీజేపీలో చేరారు. తాజాగా ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో ఏకంగా ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ పరిణామాల నేపథ్యంలో కర్నూలు మేయర్ సహా, మున్సిపాలిటీలను వైసీపీ చేజార్చుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

చైర్మన్ పీఠం కోసం పావులు

ఎమ్మిగనూరు మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. మున్సిపల్ చైర్మన్ కేఎస్ రఘు సహా ఏడుగురు కౌన్సిలర్లు టీడీపీ వైపు చూస్తున్నారు. కౌన్సిల్‌లో 34 సభ్యులు ఉంటే.. శంకరమ్మ మృతితో 33కు చేరింది. ఎమ్మెల్యే బీవీ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా మొత్తం సభ్యుల సంఖ్య 34కు చేరింది. చైర్మన్ పీఠం దక్కాలంటే 18 మంది సభ్యుల ఉండాలి. టీడీపీలో చేరిన ఐదుగురు కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు కలిపితే 8 మందికి చేరుతుంది. చైర్మన్ పీఠం దక్కించుకోవాలంటే మరో 10 మంది సభ్యులు మద్దతు కావాలి. ఒకవేళ మరో 10 మంది వచ్చినా.. పంచాయతీ రాజ్ యాక్ట్-1994 ప్రకారం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే మరో 9 నెలలు ఆగాల్సి ఉంది. దీంతో పీఠం ఉన్నా పవర్ లేని పార్టీలో ఉండడం కంటే టీడీపీలో చేరితే ఎలా ఉంటుంది..? అని ఆలోచిస్తున్న చైర్మన్ రఘు సహా ఆయన సన్నిహిత కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకునేందుకు అధికార టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యే బీవీ ఎత్తులతో ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో రాజకీయం ఆసక్తిగా మారింది. వీరితో పాటు మరికొందరు కౌన్సిలర్లు టీడీపీ నేతలకు టచ్‌లో ఉన్నారు. 'ఐదేళ్ల ప్రతిపక్షంలో వైసీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు ఎదురొడ్డి పార్టీకి, బీవీకి అండగా నిలబడ్డాం.. ఆర్థికంగా కూడా నష్టపోయాం.. అధికారం వచ్చాక వైసీపీ కౌన్సిలర్లు పార్టీలోకి రావడంతో మా పరిస్థితి ఏమిటి..' అని ఆ వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు మదనపడుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన ఏ ఒక్క నాయకుడు, కార్యకర్తకు అన్యాయం జరగదని, వారికి ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే బీవీ భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

ఆదోనిలో ఇలా..!

ఆదోనిలో కూడా ఇదే పరిస్థితి ఉంది. 42 వార్డులు ఉంటే గత స్థానిక సంస్థలు ఎన్నికల్లో వైసీపీ 41 వార్డుల్లో విజయం సాధించింది. రూ.లక్షలు ఖర్చు చేసి ఎన్నికల్లో గెలిస్తే పదవులు వచ్చాయి. పవర్ మాత్రం వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు వై.మనోజ్‌రెడ్డి, ఆయన సన్నిహితుడు ఎర్రిస్వామిలే. దీంతో పవర్ లేని పార్టీలో మేముండలేమని 13,18,25వ వార్డుల కౌన్సిలర్లు పద్మావతి, చిన్న, వెల్లాల లలితమ్మ, ఎంపీపీ బడాయి దానమ్మ సహా పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వైసీపీని వీడి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరారు. మరికొందరు కౌన్సిలర్లు టీడీపీ, బీజేపీ నేతలకు టచ్‌లో ఉన్నారు. ఇదిలా ఉండగా ఆదోని మున్సిపల్ పరిధిలో బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు టీడీపీ తరఫున, మరో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ వైసీపీ తరఫున ఎక్స్ అఫిషియో సభ్యులుగా కొనసాగుతున్నారు.



ఆదోనిలో ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు (ఫైల్)

ఎమ్మిగనూరులో టీడీపీ పట్టు

జిల్లాలో 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో కర్నూలు కార్పొరేషన్, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ, గూడూరు నగరపాలక సంస్థలను ఆనాటి అధికార వైసీపీ దక్కించుకుంది. అధికారం మాటున ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థులను భయపెట్టి, పోలీసులతో దౌర్జన్యాలు చేసి వైసీపీ ఏకపక్షం చేసుకుందనే ఆరోపణలున్నాయి. ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో కూడా ఆనాటి వైసీపీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఆ పార్టీ ముఖ్య నేతలు అధికారం అడ్డం పెట్టుకొని, పోలీసులతో భయపెట్టి 34 వార్డులకు గాను 31 వార్డుల్లో విజయం సాధించారు. రిజర్వేషన్లలో భాగంగా చైర్మన్ పీఠం బీసీలకే కేటాయించడంతో 27వ వార్డు కౌన్సిలరు కేఎస్ రఘు చైర్మన్ అయ్యారు. పేరుకు రఘు చైర్మన్ అయితే పెత్తనమంతా వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్ చెలాయిస్తున్నాడు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఆయన తనయుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. టీడీపీ అభ్యర్థులు 4వ వార్డు నుంచి రామదాస్‌గౌడ్, 21వ వార్డు నుంచి వీజీఆర్ దయాసాగర్, 33వ వార్డు నుంచి శంకరమ్మ విజయం సాధించారు. వీరిలో శంకరమ్మ ఆనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. కౌన్సిల్‌లో టీడీపీ బలం కేవలం ఇద్దరు కౌన్సిలర్లే. పట్టణం అభివృద్ధి చెందాలంటే కౌన్సిల్ తీర్మానాలు ఎంతో కీలకం. కౌన్సిల్‌లో పట్టు సాధించకపోతే అభివృద్ధిపై ప్రభావం పడుతుందని గ్రహించిన ఎమ్మెల్యే బీవీ ఆ దిశగా రాజకీయ ఎత్తులు వేశారు. అదే సమయంలో అభివృద్ధికి తమ సహకారం అంటూ వైసీపీకి చెందిన 5వ వార్డు కౌన్సిలర్ అమన్, 16వ వార్డు కౌన్సిలర్ ఇసాక్, 23వ వార్డు కౌన్సిలర్ చంద్రమోహన్‌రెడ్డి, 29 వార్డు కౌన్సిలర్ రజిత, 7వ వార్డు కౌన్సిలర్ వై.సుంకమ్మ వైసీపీని వీడి ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. అంటే ఇప్పుడు టీడీపీ బలం ఏడుగురికి చేరింది.



ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు(ఫైల్)

కర్నూలు మేయర్ పీఠంపై గురి

కర్నూలు మేయర్ పీఠంపై టీడీపీ గురి పెట్టింది. నగరపాలక సంస్థలో 52 మంది కార్పొరేటర్లు ఉన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు టీజీ భరత్, గౌరు చరిత ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకోవడంతో ఓటు హక్కు కలిగిన సభ్యుల సంఖ్య 55కి చేరింది. మేయర్ పీఠం దక్కించుకోవాలంటే 27 సభ్యులు ఉండాలి. ప్రస్తుతం వైసీపీ బలం మేయర్ బీవై రామయ్యతో కలిపి 44 మంది ఉన్నారు. టీడీపీ కార్పొరేటర్ల సంఖ్య 8 మంది ఉంటే ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిపి 11 మందికి చేరింది. అదే క్రమం 3,6,11,13,17,22,30,30 వార్డుల వైసీపీ కార్పొరేటర్లు షాజహాన్‌పర్వీన్, నీలోఫర్ షేక్, ఫరాజ్‌ఖాన్, విజయలక్ష్మి, క్లైపా పద్మాలతా రెడ్డి, అలియాషేక్‌లు వైసీపీని గుడ్‌బై చెప్పి మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే 30వ వార్డు కార్పొరేటర్ జయరాముడు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సమక్షంలో, 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్ కోడుమూరు టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అంటే టీడీపీ బలం 17కి చేరింది. మేయర్ పీఠం దక్కాలంటే మరో 11 మంది కార్పొరేటర్లు అవసరం ఉంది. ఇప్పటికే కర్నూలు నియోజకవర్గంలో ఐదుగురు, పాణ్యం పరిధిలో ఆరుగురు, కోడుమూరు నియోజకర్గం పరిధిలో ఇద్దరు కలిపి 13 మంది టీడీపీతో టచ్‌లో ఉన్నారు. 2025 మార్చి తరువాత ఏ క్షణమైన అవిశ్వాసం పెట్టి మేయర్ బీవీ రామయ్యను దింపే అవకాశం ఉందని రాజకీయంగా చర్చ జరుగుతుంది.



కర్నూలులో మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు (ఫైల్)

జీడీపీలో తగ్గుతున్న నీరు

- ప్రస్తుతం 0.95 టీఎంసీల నిల్వ
- కోడుమూరుకు కుడి కాలువ ద్వారా వంద క్యూసెక్కులు
- ఎడమ కాలువ ద్వారా 20 క్యూసెక్కులు విడుదల

గోనెగండ్ల, జూలై 16: గోనెగండ్ల మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టులో నీరు అడుగంటి పోవడంతో ప్రాజెక్టు వెలవెల పోతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 0.95 టీఎంసీ నీరు(గ్రాస్) మాత్రమే ఉంది. మంగళవారం కోడుమూరుకు తాగునీటి అవసరాల కోసం కుడి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. అలాగే ఎడమ కాలువ ద్వారా గాజులదిన్నె, హెచ్‌కైరవాడి గ్రామాలకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీంతో రోజురోజుకు ప్రాజెక్టులో నీరు అడుగంటిపోతోంది. ఎగువ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ప్రాజెక్టుకు వరద నీరు రావడం లేదు. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలుగా కాగా ప్రాజెక్టు కింద 25వేల ఎకరాలు సాగు భూమి ఉంది. రెండేళ్లుగా జూన్ చివరి నాటికి ప్రాజెక్టులో వరద నీరు వచ్చి సమృద్ధిగా చేరేది. ఈ ఏడాది జూలై నెల సగం రోజులు గడిచినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రాజెక్టుకు నీరు చేరలేదు.

వాసంతి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

కర్నూలులో ప్రజా సంఘాల నిరసన



కలెక్టరేట్ ఎదుట క్యాండిల్ ర్యాలీని నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య యువజన సంఘాలు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 16: నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో వాసంతిని అత్యాచారం, హత్యకు పాల్పడిన, సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. వాసంతి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అఖిల భారత యువజన సమాఖ్య, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ వాసంతి అనే 8 ఏళ్ల బాలికను ముగ్గురు బాలురు అత్యాచారం చేసి హత్య చేశారన్నారు. బాలిక శవాన్ని బాలుర తల్లిదండ్రులు మాయం చేశారన్నారు. పది రోజుల నుంచి మృతదేహం లభించకపోవడం చాలా బాధాకరమన్నా రు. నిందితులకు కఠిన చర్యలతో పాటు వాసంతి మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో మహిళ సమైఖ్య నగర నాయకులు రేణుకమ్మ, విజయ, సువర్ణమ్మ, సుశీల, ఏఐవైఎఫ్ నగర నాయకులు చంటి, సురేంద్ర యాదవ్, రాజశేఖర్, రాముడు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీ

ఇద్దరు సీఎంవోలకు మెమోలు



క్యాజువాల్టీలో తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూలై 16: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగమైన క్యాజువాల్టీలో మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ల (సీఎంవో) హాజరు పట్టిక, సమయపాలన గురించి వారు ఆరా తీశారు. ఈ నెల 1వ తేదీ నుంచి అటెండెన్స్ రిజిస్టర్‌లో ఇద్దరు సీఎంవోలు సంతకాలు పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఇద్దరు సీఎంవోలకు మెమో జారీ చేశారు. క్యాజువాల్టీలో ఎంత మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు, హౌస్ సర్జన్లు ఉన్నారనీ, ఎంత మంది డ్యూటీకి వస్తున్నారని ఆరా తీశారు. అనంతరం మెడికల్, ఆర్థో, ఐడీ, ఓపీ కేంద్రాలను పరిశీలించారు. పలు ఓపీ విభాగాల్లో వైద్యులు ఆప్రాన్, ఐడీ కార్డు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు తప్పనిసరిగా ఐడీ కార్డు, ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయాలని ఆదేశించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

కర్నూలు(న్యూసిటీ), జూలై 16: నగర పాలక సంస్థకు సంబంధించిన స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు కమిషనర్ భార్గవతేజ మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. 18న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 18 నుంచి 24 వరకు ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. అదే రోజు సాయంత్రం స్వీకరించిన వారి పేర్లను నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తారు. 25న పరిశీలన, 28న విత్‌డ్రా, అదే రోజు ఎన్నికల్లో ఉండే అభ్యర్థుల జాబితా విడుదల ఉంటాయి. ఆగస్టు 1న కొత్త కౌన్సిల్ హాలులో ఎన్నికల అనంతరం అభ్యర్థులను ప్రకటిస్తారు. ప్రస్తుతం సభ్యులుగా ఉన్న ఐదుగురు క్లైప పద్మలత, జీఎల్‌వీ. సుజాత, సుంగాల సుదర్శన్‌రెడ్డి, ఎ. లక్ష్మీరెడ్డి, నగరూరు శ్రీనివాసరావు పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. స్థాయి సంఘానికి మేయర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

నేడు తొలి ఏకాదశి

- ముస్తాబైన వైష్ణవ ఆలయాలు
- చాతుర్మాస దీక్షలకు ప్రాముఖ్యత

కర్నూలు (కల్చరల్), జూలై 16: తెలుగువారు పవిత్రంగా భావించే తిథుల్లో ఏకాదశి ఒకటి. ప్రతి నెలలో రెండుసార్లు ఏకాదశి వచ్చినప్పటికీ, ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశికి ప్రాధాన్యతనిస్తారు. సర్వమానవాళి రక్షకుడు శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో అకాల మృత్యుహరణంతో పాటు మోక్షప్రాప్తి కోసం ఈ రోజున కఠిన నియమాలతో ఉపవాస వ్రతాలు ఆచరిస్తుంటారు. సంప్రదాయవాదులు అందరూ ఈ తిథితో పండుగల ప్రస్థానం మొదలవుతున్నట్లుగా భావిస్తారు. మోక్ష సాధనకు మనసును మహా విష్ణువుపైన లగ్నం చేసి ఆరాధించడమే ఏకాదశి పండుగ ప్రత్యేకం. ఏకాదశి రోజున ఉపవాస దీక్షలు ఆచరించి తెల్లవారాక అంటే ద్వాదశి రోజున ఎవరికైనా భోజనం పెట్టి ఉపవాస దీక్ష విరమిస్తే లక్ష్యం సిద్ధిస్తుందని నమ్ముతారు. లోకాలన్నింటినీ పరిపాలించే శ్రీమహావిష్ణువు జగద్రక్ష విధుల్లో అలసిపోయాక విశ్రాంతి కోసం యోగనిద్రలోకి వెళ్లే రోజు తొలి ఏకాదశి. అందుకే దీనిని శయనైకాదశిగా వ్యవహరిస్తారు. తిరిగి నాలుగు నెలల తర్వాత కార్తీక మాసంలోని ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు మేల్కొంటారు. దీని ఉత్థాన ఏకాదశిగా, వైకుంఠ ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఈ నాలుగు నెలల కాలంలో వివిధ హిందూధర్మాన్ని బోధించే మఠాలు, ఆశ్రమాల్లోని వారంతా చాతుర్మాస దీక్షలను ఆచరిస్తారు. ఈ నాలుగు నెలలు మహా విష్ణువు పాతాళలోకంలోని బలి చక్రవర్తి వద్ద ఉండి, కార్తీక పౌర్ణమి నాడు తిరిగి వస్తాడని విష్ణుపురాణం చెబుతుంది.

పుణ్యప్రదం.. ఏకాదశివ్రతం

చాతుర్మాస దీక్షల్లో ఆరోగ్య పరిరక్షణ దిశగా ఆహార నియమాలను నియంత్రిస్తుంది. ఈ నాలుగు నెలల కాలంలో కేవలం కూరగాయలు, దుంపలు, పేలాలు వంటివి ఇలా శారీరక యోగాన్ని పెంపొందించుకునే దిశగా నాలుగు నెలల పాటు దీక్షలను ఆచరిస్తారు. ఏకాదశి రోజున రాత్రి జాగరణ చేస్తారు. విష్ణు సహస్ర నామ పారాయణాలు, విష్ణుమూర్తికి సంబంధించిన భాగవత కథలు పఠిస్తారు. నగరంలోని వివిధ వైష్ణవ దేవాలయాల్లో ఏకాదశి సందర్భంగా వేకువ జామునుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఆరోగ్య పరిరక్షణకే చాతుర్మాస దీక్షలు



తొలి ఏకాదశి పండుగ హైందవ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తుంది. ఇందులో ఎన్నో ఆధ్యాత్మిక, ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. తొలి ఏకాదశి నుంచీ నాలుగు నెలల పాటు చాతుర్మాస దీక్షలు మొదలు అవుతాయి. ఇవి ఒకరకంగా మన ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంపొందింపజేసేవి. ఈ చాతుర్మాస దీక్షల్లో తీసుకునే ఆహార నియమాలు ప్రతి వ్యక్తిని ఒక యోగిగా తయారు చేస్తాయి. ఈ నాలుగు మాసాల్లో స్వీకరించే సాత్విక ఆహారం వల్ల శరీరంలో అనేక మార్పులతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. హిందుత్వ పండుగల్లో భక్తిభావనతోపాటు అంతర్లీనంగా ఆరోగ్యసంరక్షణకు అనేక సూత్రాలు దాగి ఉన్నాయి.

- దేవళ్ల వసంత సాయినాథ శర్మ, అర్చకులు, కర్నూలు

వీడిన మిస్టరీ.. దొరకని మృతదేహం..!



ముచ్చుమర్రి ఎత్తిపోతల పతకం అప్రోచ్ కాలువలో మృతదేహం కోసం గాలిస్తున్న ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు(ఫైల్)

- వాసంతి ఘటనలో పురోగతి
- అత్యాచారం, హత్య చేసిన మైనర్లు..
- బాలిక మృతదేహాన్ని నదిలో పారేసిన పెద్దలు
- పోలీసుల అదుపులో ముగ్గురు మైనర్లతో పాటు మరో ఇద్దరు
- బాలిక మృతదేహం కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడి

నందికొట్కూరు, జూలై 16: పది రోజుల క్రితం కనిపించకుండా పోయిన బాలిక వాసంతి కేసులో ఎట్టకేలకు పోలీసులు పురోగతి సాధించారు. నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఈ మేరకు.. ఈనెల 7వ తేదీన సాయంత్రం ఆరు గంటల సమయంలో రద్దీగా ఉన్న పార్కులో వాసంతి ఆడుకుంటోంది. అదే పార్కులో ముగ్గురు బాలురు ఆ బాలికను పార్కులోనే ఉన్న ఓ దేవాలయం వద్దకు తీసుకెళ్లి అత్యాచారం చేశారు. ఆపైన బాలికకు చాక్లెట్లు కొనిచ్చి ఇంటికి వెళ్లమన్నారు. అయితే జరిగిన విషయం బాలిక ఇంట్లో చెబితే తాము చేసిన నేరం బైటపడుతుందని అనుకున్నారు. బాలికను ఇంటి దగ్గర వదులుతామని చెప్పి సైకిల్‌పై ఎక్కించుకొని వనములపాడు వైపు కేసీ కెనాల్‌పై తీసుకెళ్లారు. ముచ్చుమర్రి గ్రామశివారులోని కేసీ కాలువ చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి గొంతునులిమి చంపేశారు. మృతదేహాన్ని పొదల్లో దాచిపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో తెలియక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. ఆ ముగ్గురిలో ఒక బాలుడి తండ్రి యోహాన్, మరో బాలుడి పెదనాన్న సద్గురుడు మృతదేహాన్ని మాయం చేసేందుకు వ్యూహం



సంఘటన వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య(ఫైల్)



వాసంతి (ఫైల్)

పన్నారు. ఆ ఇద్దరూ కలిసి సంచిలో మృతదేహాన్ని వేసుకొని, ద్విచక్రవాహనంపై వనములపాడు మీదుగా వచ్చి, దిగువ రస్తాలో ముచ్చుమర్రి శివారు ప్రాంతం నుంచి ఎత్తిపోతల పథకం దగ్గరికి వెళ్లారు. అక్కడ మృతదేహనికి రాయి కట్టి నదిలోకి తెప్ప మీద వెళ్లి మధ్యలో నీళ్లలో పడేశారు. దీని వల్ల మృతదేహం ఒండ్రుమట్టిలో కూరుకుపోయి ఉంటుందని, అందుకే ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలకు కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు.

ఓ చిన్నారి ఇచ్చిన సమాచారంతో తీగలాగారు

ఆదివారం సాయంత్రం నుంచి తన కూతురు కనిపించడం లేదని వాసంతి తండ్రి సంగెం మద్దిలేటి ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి గ్రామంలో బాలిక తప్పిపోయిందంటూ పోలీసులు డప్పు వేయించారు. సోమవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి నందికొట్కూరులో విజయకేతన సభలో మాట్లాడుతూ గ్రామంలో ఓ బాలిక కనిపించకుండా పోయిందని, ఆమె ఆచూకి 24 గంటల్లో తేల్చాలని ఆమె పోలీసులకు సూచించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు విచారణ చేపట్టారు. కాని సోమవారం ఎలాంటి సాక్ష్యాధారాలను వెతకలేకపోయారు. సాయంత్రం డిఎస్పీ శ్రీనివాసరావు బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. మంగళవారం పోలీసులు విచారణలో ఒక చిన్నారి వాసంతితో కలిసి పార్కుకు వచ్చిందని తేలింది. ఆ బాలికతో పోలీసులు మాట్లాడగా.. ఆ రోజు ముగ్గురు అబ్బాయిలు పార్కులో గొడవ చేస్తుంటే వాచ్‌మెన్ వాళ్లను తిట్టాడని, వారు వాసంతిని కిడ్నాప్ చేస్తామని బెదిదించారని తెలిసింది. ఆ ముగ్గురిని బాలిక గుర్తించింది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అయితే బాలురు మొదట ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో మృతదేహాన్ని పడేశామని చెప్పడంతో రెండు రోజుల పాటు గజఈతగాళ్లతో పాటు, ఏపీ ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు గాలించాయి. కానీ మృతదేహం కనిపించలేదు. 10వ తేదీన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సంఘటన స్థలా



బాధితులను పరామర్శిస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి(ఫైల్)

నికి చేరుకొని నేరస్తులను వదిలిపెట్టడానికి వీల్లేదని అన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దోషులను బయటపెట్టాలని పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు బాలురు పూటకో సమాధానం చెప్పడంతో కాలం గడిచిపోయింది. బాలురలో ఒకరి తండ్రి అయిన యోహాన్ నెలరోజులైనా శవాన్ని గుర్తించలేరని చెప్పినట్లు తెలియడంతో పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడు మృతదేహాన్ని కృష్ణానదిలో పడేశామని చెప్పడంతో అక్కడ గాలింపు చర్యలు చేపట్టారు. కాని వాసంతి మృతదేహం లభ్యం కాలేదు. గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

ముగ్గురిపై పోక్సో కేసు.. మరో ఇద్దరికి రిమాండ్

బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన ముగ్గురు మైనర్లపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి కర్నూలు జువైనల్ హోంకు తరలించారు. అదేవిధంగా బాలురు చేసిన తప్పును సమర్థిస్తూ బాలిక మృతదేహాన్ని మాయం చేసిన కేసులో యోహాన్, సద్గురుడులను అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు నందికొట్కూరు సబ్‌జైల్‌లో రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా వాసంతి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, కేసు బలోపేతం కోసం సాక్షాలను సేకరిస్తున్నట్లు ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా వెల్లడించారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, కేవలం చిన్నారులు చేసిన తప్పును తలిదండ్రులు కప్పిపుచ్చుకునేందుకే శవాన్ని మాయం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో కేసును విచారించిన ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆత్మకూరు డిఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లభించని వాసంతి మృతదేహం: గత పది రోజుల క్రితం కనిపించకుండా పోయిన వాసంతి మృతదేహం ఇంత వరకు లభ్యం కాలేదు. ఘటన జరిగి పదిరోజులు అవుతున్నా మృతదేహం కనిపించకపోవడంతో ఇక కనిపిస్తుందన్న నమ్మకం లేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీలు అధిరాజ్ సింగ్ రాణా, రఘువీర్ రెడ్డి

నిందితులకు శిక్ష పడేలా చేస్తాం: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 16: తాను నంద్యాల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముచ్చుమర్రి వాసంతి మిస్సింగ్ కేసు మొదటిదని అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. ఈ కేసులో విచారణ జరుగుతోందని, మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతాయన్నారు. సాక్ష్యాలను సేకరిస్తున్నామన్నారు. ఈ కేసులో అత్యాచారం చేసి, హత్య చేసినట్లు ముగ్గురు బాలురు ఒప్పుకున్నారని అన్నారు. వారిలో ఒక బాలుడి తండ్రి, మరో బాలుడి పెద్దనాన్న కలిసి వాసంతి మృతదేహాన్ని కృష్ణానదిలో పడేసినట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు.

ఆసుపత్రుల అభివృద్ధికి సహకరించాలి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి ఎంపీ

కర్నూలు(అర్బన్), జూలై 16: జిల్లాలో ఆసుపత్రుల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. మంగళవారం విజయవాడలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని పలు ఆసుపత్రులు, జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రులపై తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి అంశాలపై చర్చించారు.



మంత్రిని కలిసిన ఎంపీ

- కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ: విజయవాడలోని కనక దుర్గమ్మను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను, చిత్రపటాన్ని అందజేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 16: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల దుర్మరణం

- వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు
- ద్విచక్రవాహనాల్లో వెళ్తుండగా రోడ్డు ప్రమాదాలు

పత్తికొండ, జూలై 16: కర్నూలు జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. పత్తికొండ మండలంలో ఇద్దరు, దేవనకొండలో మరో యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. పత్తికొండ మండలపరిదిలోని దూదేకొండ దూదేకొండ గ్రామానికిచెందిన బడెద్దులక్రిష్ణ కొడుకు సురేష్(18) డెకరేషన్ పనులకు వెళ్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. అదేగ్రామానికి చెందిన దొడ్డిగోపాల్ పెద్దకొడుకు మణికుమార్ (18) పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. గ్రామంలో రెండురోజులుగా జరుగుతున్న మొహరం వేడుకల్లో సురేష్, మణి ఇద్దరు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం పెద్దసరిగెత్తుకోసం రాత్రికి ఆడే సావ్‌నేస్‌లో ప్రత్యేకంగా కనిపించేందుకు కొన్నివస్తువుల కోసం ద్విచక్ర వాహనంపై పత్తికొండకు వెళ్లారు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా సుకలినాగమ్మ గుడివద్ద ప్రమాదవశాత్తు ఎద్దులబండిని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మణికుమార్(ఫైల్)



సురేష్ (ఫైల్)

అక్కను చూసి వస్తూ...



ప్రమాద తీవ్రతకు రెండు భాగాలుగా విడిపోయిన ద్విచక్ర వాహనం



మృతి చెందిన యువకుడు

దేవనకొండ: తోడబుట్టిన సోదరిని చూసేందుకు వెళ్లి వస్తుండగా ఓ యువకుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సంఘటన దేవనకొండలో చోటు చేసుకుంది. గోనేగండ్ల మండలం వర్కూరు గ్రామానికి చెందిన పాపారాయుడు, అంజినమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. వీరిలో చిన్న కుమారుడు మునెప్ప (19) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దేవనకొండ మండలంలోని పి.కోటకొండలో ఉన్న ఇద్దరు అక్కలను చూసి వర్కూరుకి ద్విచక్ర వాహనంపై తిరుగుప్రయాణమయ్యాడు. వీరంపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే కర్నూలు నుండి బళ్లారి వైపు వెళ్తున్న లారీ మునెప్ప బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో యువకుడు అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యాడు. ద్విచక్రవాహనం సైతం రెండు భాగాలుగా ధ్వంసమైంది. ప్రమాదంపై దేవనకొండ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సుంకేశ్వరిలో తగ్గిన అతిసార

- ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా
- 24/7 గంటలు ఉచిత వైద్య శిబిరం



వైద్యశిభిరం నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు

మంత్రాలయం, జూలై 16: మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో విజృంభించిన అతిసార మంగళవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. వైద్యులు సోమవారం నుంచి మంగళవారం రాత్రి వరకు ఇల్లిల్లు తిరిగి అస్వస్థతకు గురైన వారికి వైద్యచికిత్సలు అందించారు. మెరుగైన వైద్యసేవల కోసం 15 మందిని ఎమ్మిగనూరు, ఆదోని ఆసుపత్రులకు తరలించారు. అధికారులు గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న సీసీ రోడ్లు, మురికి కాలువలను శుభ్రం చేసి నీటి సరపరాను బంద్ చేసి, తాగునీటి బోర్లను తొలగించారు.

ఆశాలు, వైద్యసిబ్బందిపై జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఆగ్రహం

మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార విజృంభించి ఒక చిన్నారి బాలిక మృతి చెందడం, 70 మంది అస్వస్థతకు గురి కావడంతో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందిపై జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామంలో పర్యటించి పరిశుభ్రత, తాగునీరు, రోగులను పరామర్శించి ఉచిత వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు రోజుల పాటు 24 గంటల వైద్యశిబిరం కొనసాగుతుందని అన్నారు. ఎవరూ ఆందోళనలు చెందకుండా సచివాలయంలోని వైద్యబృందం దగ్గర చికిత్సలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పిల్లలను, వృద్ధులను వైద్యశిబిరానికి తీసుకురావడంలో ఆశాలు, వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముకురన్న, ఎంపీడీవో మునెప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వేద స్వరూప, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, వీఆర్వో ఆనంద్, కార్యదర్శి చిరంజీవి, డాక్టర్లు సురేష్, వసంతమ్మ, నాయకులు రోగెప్ప, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

సురక్షిత మంచినీరు సరఫరా

గ్రామంలో నీటి బోర్ల ద్వారా సరఫరా చేసే నీటి పైపులను తొలగించి ప్రత్యేక వాటర్ ట్యాంకర్ల ద్వారా ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ వేద స్వరూప దగ్గరుండి సురక్షిత నీటిని ఆయా కాలనీలో సరఫరా చేశారు. దీంతో గ్రామస్థులు వారి ఇంటి వద్ద తాగునీటిని పట్టుకుని పలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.



గ్రామంలో ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్న అధికారులు

సుంకేశ్వరి పంచాయితీ కార్యదర్శికి నోటీసులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 16: విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామ పంచాయతీ కార్యదర్శికి డీపీఓ నాగరాజునాయుడు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేసినా కూడా పంచాయితీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారనీ పేర్కొన్నారు. సుంకేశ్వరి గ్రామ పంచాయితీలో పారిశుధ్యం లోపం కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరిగిందన్నారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

ఏపీపీఈడబ్ల్యూఏ ప్రచార కమిటీ ఛైర్మన్‌గా పాల్‌రాజ్



పాల్‌రాజ్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

కర్నూలు(కల్చరల్), జూలై 17: ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ (ఏపీపీఈడబ్ల్యూఏ) సమాచార ప్రచార కమిటీ ఛైర్మన్‌గా కర్నూలుకు చెందిన పాల్‌రాజ్ ఎంపికయ్యారు. మంగళవారం విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్ హోటల్ సమావేశ హాలులో ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ 16వ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమాచార ప్రచార కమిటీ ఛైర్మన్‌గా పాల్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాల్‌రాజ్ మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి యూనియన్ రాష్ట్ర నాయకులు కృషి చేయాలని కోరారు. అలాగే ఎలక్ట్రీషియన్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకుపోయి తనవంతుగా వాటి పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు. అసోసియేషన్‌లో పాల్‌రాజ్ సమాచార ప్రచార కమిటీ ఛైర్మన్‌గా ఎంపిక కావడంపై అసోసియేషన్ నాయకులు ఆయనను అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

సి.బెళగల్, జూలై 16: మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామానికి సమీపంలోని తుంగభద్రనదిలో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలి స్తున్న టీ చామలగూడూరుకు చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నదితీర గ్రామాలలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వదిలే ప్రసక్తి లేదన్నారు. అలాగే గ్రామాలలో మద్యం, పేకాట, గుట్కా వంటివి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

రాఘవేంద్రస్వామి మఠంలో హుండీ చోరీ

మంత్రాలయం, జూలై 16: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పరిధిలోని రైల్వేస్టేషన్ తుంగభద్ర శ్రీమఠంలో హుండీ చోరీకి గురైంది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీమఠం ప్రధాన ద్వారాన్ని పగులకొట్టి లోపలికి వెళ్లి హుండీకి ఉన్న రెండు తాళాలను ధ్వంసం చేశారు. అందులోని నగదును అపహరించుకువెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయం తెరిచి పూజలు చేసేందుకు వెళ్లిన ఆ మఠం మేనేజర్ పురిడి నాగేశాచార్ సమాచారాన్ని మంత్రాలయం మఠం అధికారులకు తెలియజేశారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిల సూచన మేరకు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న మాధవరం ఎస్‌ఐ కృష్ణమూర్తి ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ హుండీని గత మార్చి 31 వరకు లెక్కించినట్లు మఠం మేనేజర్ తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ మూడున్నర నెలల హుండీ ఆదాయం చోరీ జరిగిందని, దాదాపు రూ.30వేలకు పైగానే నగదు ఉంటుందన్నారు.



హుండీ పగులకొట్టిన దృశ్యం

కూటమి గెలుపులో ఆర్యవైశ్యులది కీలక పాత్ర

» నామినేటెడ్, పార్టీ పదవులు ఇవ్వాలి
» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి


మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు (అర్బన్), జూలై 16: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపులో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు శ్రమించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం పని చేసిన ఆర్యవైశ్యులను గుర్తించి నామినే టెడ్ పోస్టులు, పార్టీ పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముక్కుమ్మడిగా వైశ్యులు ఎన్‌డీఏ పక్షాలకు ఓట్లు వేసి గెలిపించారని, వారి సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 16: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ బాండ్లకు జమ చేసిన డబ్బుకు మిస్సింగ్ క్రెడిట్‌ను నమోదు చేయాలని ఏపీజీఎల్ఐ జాయింట్ డైరెక్టర్ ఎం.కృష్ణకు అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత డీఈవోల ద్వారా సమాచారం తీసుకుని పరిష్కరించాలన్నారు. దీనికి జాయింట్ డైరెక్టర్ ఎం.కృష్ణ స్పందిస్తూ వీలైనంత త్వరగా ఆన్‌లైన్ ద్వారా సమస్యలు పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. జాయింట్ డైరెక్టర్‌ను కలిసిన వారిలో అపస్ జిల్లా కార్యదర్శులు గిరిబాబు, ఎస్.శ్రీనివాసులు, కృష్ణగిరి మండల అపస్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఓర్వకల్లు మండల అధ్యక్షులు కే.రామకృష్ణ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 16: ముచ్చుమర్రి గ్రామానికి చిన్నారి వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళ వారం కలెక్టరేట్ ఎదుట వివిధ సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వాల్మీకి యువసేన అధ్యక్షుడు వినోద్ కుమార్, రాయలసీమ యువజన పోరాట సమితి నాయకుడు వీవీ నాయుడు మాట్లా డుతూ వాసంతి చనిపోయి పది రోజులు గడుస్తున్నా కూడా శవం దొరకకపోవడం సిగ్గుచేటన్నారు. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు వైఫల్యం చెందారని ఆరోపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీలు బకాయిలు చెల్లించకుంటే చర్యలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 16: నగర పాలక సంస్థ పరిధిలోని ఏజెన్సీలు బకాయిలు చెల్లించకుంటే చర్యలు తప్పవని కమిషనర్ భార్గవతేజ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రెండు రోజుల్లో బకాయిలు చెల్లించకుంటే హోర్డింగులను తొలగిస్తామన్నారు. 14 ఏజెన్సీలు, 8 సినిమా థియేటర్ల నుంచి రూ.1,69,30,196 బకాయిలు నగర పాలకకు రావాల్సి ఉందని కమిషనర్ పేర్కొన్నారు.

చరిత్రలో కల్కి సినిమా నిలిచిపోతుంది

కర్నూలు(న్యూసిటీ), జూలై 16: యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన కల్కి సినిమా కలెక్షన్లు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతాయని ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జాగీరప్ప అన్నారు. రెండు రోజుల క్రితం కల్కి సినిమా రూ.1000 కోట్ల కలెక్షన్స్ సాధించడంతో మంగళవారం అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

భక్తిభావం పెంచుకోవాలి: ఎమ్మెల్యే



హుశేనాపురంలో పీర్లకు పూజలు చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్, చనుగొండ్లలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

ఓర్వకల్లు, జూలై 16: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని మొహరం వేడుకల్లో భాగంగా చెన్నంచెట్టిపల్లె, హుశేనాపురం, ఉప్పలపాడు గ్రామాల్లో వెలసిన పీర్ల దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌరు చరితమ్మకు ఆయా గ్రామాల్లో మేళతాళాలతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. హుశేనాపురం గ్రామ టీడీపీ అధ్యక్షుడు బజారు ఇంట్లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లెల జ్యోతి, నాయకులు గోవిందరెడ్డి, చంద్రపెద్దస్వామి, విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పెద్దసరిగెత్తు

గూడూరు: మండలంలో చనుగొండ్ల, ఆర్.కానాపురం, పెంచికలపాడు, కె.నాగులాపురం, బూడిదపాడు గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్దసరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పీర్ల స్వాములను ఊరేగించారు. కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్యలు వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందో బస్తును నిర్వహించారు.

తల్లి పేరుతో విద్యార్థులు మొక్కలు నాటాలి

కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్


ఉమెన్స్ హాస్టల్‌లో మొక్కను నాటుతున్న ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్), జూలై 16: ప్రతి వైద్య విద్యార్థిని విధిగా తల్లి పేరుతో మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ అన్నారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని యూజీ వైద్యవిద్యార్థినుల హాస్టల్‌లో ప్రిన్సిపాల్ డా. చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, హాస్టల్ వార్డెన్ డాక్టర్ మాధవి శ్యామల మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌లు మాట్లాడుతూ విద్యార్థినులు మొక్కను వృక్షంగా ఎదిగే వరకు కాపాడే బాధ్యతను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేడియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాధారాణి, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శకుంతల

సి.బెళగల్, జూలై 16: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శకుంతల మండలంలోని 18 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లను ఆదేశించారు. మంగళవారం ఈవోఆర్డీ సందీప్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ విభాగం వారితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో శకుంతల మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వైద్యాధికారి మదన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఈసమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌తో కాల్వ పూడికతీత పనులు


పనులను పరిశీలిస్తున్న కమిషనర్, టీడీపీ నాయకులు

గూడూరు, జూలై 16: గూడూరు పట్టణంలోని బాలికల వసతి గృహం ఆవరణలో నిలిచివున్న మురుగునీరు బయటకు వెళ్లడానికి ఎక్స్‌కవేటర్‌తో కాల్వ పూడికతీత పనులు చేపట్టినట్లు కమిషనర్ దివాకర్ రెడ్డి, ఏఈ నరసింహులు తెలిపారు. మంగళవారం గూడూరు పట్టణంలో బాలికల వసతి గృహం ఆవరణలో చేపట్టిన పనులను కమిషనర్ దివాకర్ రెడ్డి, ఏఈ నరసిం హులు, టీడీపీ నాయకులు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడుమూరు షాషావలి, బుడ్డంగలి, కోఆప్షన్ సభ్యులు రామాంజనేయులు, రేమట వెంకటేశ్వర్లు, పౌలు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 16: నగరంలోని 24వ వార్డు లక్ష్మీనగర్ చివరి లైన్‌లో డ్రైనేజీ, రోడ్డు వేయాలని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు ఆర్.నరసింహులు కోరారు. మంగళవారం కమిషనర్ భార్గవతేజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్డుపైకి వస్తున్నాయన్నారు. మురుగునీటితో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు డ్రైనేజీ, రోడ్డు మంజూరైందని ఇప్పటి వరకు పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో జనార్ధన్, అజ్మత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుతో అధిక లాభాలు

సి.బెళగల్, జూలై 16: పండ్లతోటల సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని కోడుమూరు ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, ఇనగండ్ల, గూడూరు గ్రామాల్లోని పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ పండ్లతోటల సాగుతో పాటు అంతర్ పంటలను కూడా సాగు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. అలాగే 5 ఎకరాల లో పు భూమి ఉన్న ఎస్సీలకు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఆయన వెంట ఆర్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాగన, రైతులు ఉన్నారు.

జీపీఎస్ నిలుపుదలపై హర్షం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 16: గ్యారెంటీ పెన్షన్ స్కీంను నిలుపుదల చేయాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించ డంపై పీఆర్‌టీయూ కర్నూలు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్‌వీ కృష్ణారెడ్డి, ఎస్.రామకృష్ణ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా పీఆర్‌టీయూ శాఖ తరపున సీఎం చంద్రబాబుకు వారు ధన్యవాదాలు తెలిపారు. సీపీఎస్‌కు బదులుగా ఓపీఎస్‌ను అమలు పరిచేలా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

జాప్యాన్ని నివారించాలి: ఏపీటీఎఫ్


వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 16: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఉపాధ్యాయుల పదవీ విరమణ తుది చెల్లింపులలో తీవ్ర జాప్యాన్ని నివారించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రంగన్న, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్య కోరారు. మంగళవారం జడ్పీ సీఈవో నాసరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల తుది చెల్లింపులో ఆడిట్ దగ్గర ఆలస్యం అవుతుందని, త్వరగా జరిగేలా చూడాలని పెండింగ్ ఫైల్స్‌ను క్లియ ర్ చేయాలన్నారు. నెలవారి పీఎఫ్ వ్యక్తిగత ఖాతాలున్న (2022-23, 2023-24) సంవత్సరాలకు సంబంధించి అప్‌డేట్ చేసి ఆన్‌లైన్ చేయాలన్నారు. మిస్సింగ్ క్రెడిట్స్ అప్‌డేట్ చేసేందుకు జిల్లాలోని డీడీవోలందరికీ సర్క్యులర్ జారీ చేసి షెడ్యూల్స్‌ను తెప్పించుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉపాధ్యా యులు, ప్రధానోపాధ్యాయులకు రావాల్సిన డీఏ, పీఆర్సీ పెండింగ్ బకాయిలు వారి వ్యక్తిగత ఖాతాలో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు పరుశురాం, వీరేష్, ప్రతాప్, రామాంజనేయులు, రంగనాథ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


కిరణ్‌కుమార్(ఫైల్)

కోడుమూరు(రూరల్), జూలై 16: మండలంలోని కొత్తూరు గ్రామంలో మల్లెపోగు కిరణ్‌కుమార్ (21) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బాలరాజు, మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమా ర్తె సంతానం. పది నెలల క్రితం బాలరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి మరణంతో తీవ్రంగా కుంగిపోయిన కిరణ్‌కుమార్ మనస్తాపంతో సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన కర్ణాటక మల్లి

ఓర్వకల్లు, జూలై 16: మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన కర్ణాటక మల్లి (26) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నన్నూరు గ్రామానికి చెందిన కర్ణాటక మల్లికి కడుపు నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి అన్న రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 16: ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ బసివిని గుండమ్మను అగ్రకులస్థులు ట్రాక్టరుతో తొక్కించి హత్య చేయడం దారుణమని, వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గొందిపర్ల మాలతి మంగళవారం డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆమెతోపాటు మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి రత్నబాయి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జి.సాయికుమార్‌లు కలిసి పరామర్శించారు. బాధిత కుటుం బానికి ప్రభుత్వం పరిహారం ఇచ్చి, కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

ఉచిత నోటు పుస్తకాల పంపిణీ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 16: బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ తెలిపారు. అలాగే త్వరలో పాఠ్య పుస్తకాలు కూడా రాబోతు న్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీబీ ఇమ్మానియేల్‌కు టాగోర్ స్మారక అవార్డు

కర్నూలు(కల్చరల్), జూలై 16: కేవీఆర్ ప్రభుత్వ మహి ళా డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు, చారిత్రక పరిశోధక రచయిత జీబీ ఇమ్మానియేల్‌కు వేక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ సంస్థ రవీంద్రనాథ్ టాగోర్ స్మారక అవార్డును అందజేసింది. కోల్‌కటా కేంద్రంగా కొనసా గుతున్న ఈ సంస్థ ఏటా దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో సామాజిక సేవలు అందిస్తున్న వారిని ఎంపికచేసి అవార్డులు ప్రదానం చేస్తోంది. కాగా ఈ ఏడాదికి గాను విద్య, సామాజిక సేవా రంగాల్లో విస్తృతంగా సేవలు అందిస్తున్నందుకు రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఎంపిక చేసిన వారిలో కర్నూలు జిల్లా నుంచి ఇమ్మానియేల్ ఎంపికయ్యారు. జీబీ ఇమ్మానియేల్ చరిత్ర అధ్యా పకునిగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచి తంగా శిక్షణలు ఇస్తున్నారు. గ్రూప్-1, గ్రూప్-2, సివిల్స్ వంటి పోటీ పరీక్షల కు ఆయన తర్ఫీదు ఇచ్చిన అభ్యర్థులు ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు.

డీఎస్సీ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 16: కర్నూలు జిల్లాలో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న డీఎస్సీ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సుంకన్నను విద్యార్థి సంఘం నాయకులు కోరారు. మంగళవారం డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సుంకన్నను కలిసి పీడీఎస్‌యూ రాజేష్, డీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శరత్, యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ కుమార్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేయడం వలన నిరుద్యోగ అభ్యర్థులు డీఎస్సీ కోచింగ్ సెంటర్లకు వెళితే నిర్వాహకులు అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కోచింగ్ సెంటరులో ఎలాంటి కనీస సౌకర్యాలు లేకపోయినప్పటికీ వందలాది మందికి అడ్మిషన్లు కల్పించి శిక్షణ ఇస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ఈ కేంద్రాలలో మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు శ్రీను, అఖిల్, రవి, సాయి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ తప్పనిసరి: ఎంపీడీవో


పంచాయతీ కార్యదర్శికి సూచనలిస్తున్న ఎంపీడీవో

కల్లూరు, జూలై 17: వాటర్ ట్యాంకుల్లోని నీటిని క్లోరినేషన్ చేశాకే సరఫరా చేయాలని కల్లూరు ఎంపీడీవో చంద్రశే ఖర్‌రెడ్డి సెక్రటరీలు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కల్లూరు మండలం హుసులూరు, బొల్లవరం, బస్తిపాడు, చిన్నటేకూరు గ్రామాల్లో ఆయన పర్యటించి పారిశుధ్యం, తాగునీటి సరఫరాను పరిశీలించారు. డ్రైనేజీల్లో పూడిక తొలగించాలని, ఖాళీ ప్రదేశాల్లో నీరునిలువ కుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరి శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ రవికిషోర్ పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా నవీన్ కుమార్


జిల్లా మత్స్య శాఖ అధికారికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నవీన్ కుమార్

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 16: కర్నూలు జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్ష స్థానానికి మంగళవారం కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి డి. పామన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో బీఎస్ నవీన్‌కుమార్ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారి పాపన్న, మత్స్యశాఖ అధికారులకు, అవాంచనీయ సంఘటనలు జరగకుండా భద్రత కల్పించిన టూటౌన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కర్నూలు మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామలమ్మ, ఎఫ్‌డీవో స్వర్ణలత నవీన్ కుమార్ నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి టీజీ భరత్‌ను కలిసిన ఎస్పీ

కర్నూలు, జూలై 16: కర్నూలు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి.బిందు మాధవ్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిశారు. మంగళవారం స్థానిక సంకల్‌బాగ్‌లోని మంత్రి టీజీ భరత్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

జిల్లా పోలీస్ కార్యాలయం తనిఖీ : స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

19వ వార్డులో సీపీఎం బృందం శ్రమదానం


సోమిశెట్టినగర్‌లో శ్రమదానం చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు, జూలై 16: కల్లూరు అర్బన్ 19వ వార్డులోని సోమిశెట్టినగర్‌లో సీపీఎం నగర్ కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.నరసింహులు బృందం ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. మంగళవారం కాలనీలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో సిపిఎం నాయకులు తొలగించారు. అదేవిధంగా సోమిశెట్టినగర్‌లోని పబ్లిక్ కొళాయిల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. మేయర్ వార్డులో సమస్యలు తాండవిస్తున్నాయని రోడ్లు, డ్రైనేజీలు, కాల్వలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం వార్డు కార్యదర్శి బీ.రాధాకృష్ణ, మాలిక్, సీతమ్మ, జయన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ షాట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

● రూ. 15లక్షల ఆస్తి నష్టం



గుడిసెకు నిప్పంటుకొని ఎగిసి పడుతున్న మంటలు



మంటల్లో కాలిపోయిన రూ. 500 నోట్లు



మంటల్లో కాలిపోయిన బంగారు, వెండినగలు

ఎమ్మిగనూరు టౌన్,జూలై 16 : స్థానిక రాఘవేంద్ర కాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. దీంతో ఇంట్లో ఉన్న సామాగ్రి, డబ్బు, బంగారు, వెండినగలు, బియ్యం కాలిపోయాయి.దాదాపు రూ.15లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు సుబ్బారావు వివరాలు మేరకు.. "రోజు మాదిరిగానే కుమారులు పనులకు వెళ్లారు. మధ్యాహ్న మూడు గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గుడిసెకు నిప్పంటుకుంది. ఇంట్లో ఉన్న చిన్న పిల్లలను, మనవళ్లను బయటకు రావాలని చెప్పడంతో అందరూ బయటకు వచ్చేశారు. మంటలు ఒక్కసారిగా గుడిసెకంతా వ్యాపించి ఎగిసి పడ్డాయి. గుడిసెలోకి వెళ్లి సామాగ్రిని తెచ్చుకునే అవకాశం లేకుండా పోయిందని ఆయన కన్నీరు మున్నీరయ్యాడు. మనవడిని బీటెక్‌లో చేర్పించేందుకు తెచ్చుకున్న రూ. 5లక్షల నగదు, 10తులాల బంగారం, 50 తులాల వెండి, 10బస్తాల బియ్యం మంటల్లో కాలిబూడిదయ్యాయి. అలాగే పిల్లలకు చదువులకు సంబంధించిన సర్టిఫికెట్లు కూడా కాలిబూడిదయ్యాయి. నిలువ నీడలేకుండా రోడ్డున పడ్డాం" అంటూ విలపించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

'పార్టీలో విభేదాలు సృష్టించొద్దు'

ఆలూరు, జూలై 16: పార్టీలో విభేదాలు సృష్టించేందుకు కొందరు టీడీపీ నాయకులు వీరభద్ర గౌడ్‌పై అధిష్ఠానానికి ఫిర్యాదులు చేయడం సరి కాదని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మునేకుర్తి రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీలో ఉన్న విభేదాల వల్లే ఎన్నికల్లో అభ్యర్థి ఓటమిపాలు అవుతున్నారని అన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలు ఉంటే నేరుగా పార్టీ కార్యాలయంలోనే కూర్చొని చర్చించాలని ఇలా అధిష్ఠానం పెద్దలకు ఫిర్యాదు చేయడం భావ్యం కాదని హితవు పలికారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నాయకులు ఐక్యంగా కష్టపడి పనిచేసే ఉంటే వీరభద్ర గౌడ్ విజయం సాధించేవారని అన్నారు. ఇప్పటికైనా పార్టీలో విభేదాలు వీడి కలిసికట్టుగా కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు వెంకటేష్ గిడ్డయ్య, నాయకులు కురువ హనుమప్ప, బీసీగేరి వెంకటేష్, చంద్ర, లింగయ్య, నారాయణ పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వం '

మంత్రాలయం, జూలై 16: కూటమి విజయం కోసం పని చేసిన కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం రాఘవేంద్రరెడ్డిని ఆయన నివాసంలో కలిసి సన్మానిం మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఐక్యమత్యంతో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళినాయుడు, బీజేపీ సీనియర్ నాయకులు బంగారయ్య, టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేపు సంఘీభావ ర్యాలీ

ఎమ్మిగనూరు , జూలై 16: ఈ నెల 7న ముచ్చుమర్రిలో అదృశ్యమైన చిన్నారి వాసంతి తల్లిదండ్రుల కడుపుకోత బాధనుంచి వారికి మనోధైర్యం కల్పించేందుకు జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు యాపిలయ్య, ఫుండుకూర రంగన్న, షబ్బీర్, రజాక్, నరసప్ప, రంగన్న తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బాలిక అదృశ్యమై రోజులు గడుస్తున్నా ఆచూకి లభించటం లేదన్నారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమంగా మద్యం తరలిస్తూ అరెస్ట్

ఆదోని, జూలై 16: కర్ణాటక నుంచి ఆదోనికి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తులను మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ తేజమూర్తి, ఎస్సై మధుసూదన్ అరెస్ట్ చేశారు. ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ డీఎస్పీ శివ నారాయణస్వామి పట్టుబడిన మద్యంను, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు విలేకరులకు ఎదుట హాజరుపరిచారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం నాగరహాల్ గ్రామం నుంచి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని స్కూటీపై తరలిస్తూ బోయ నాగరాజు, బోయ శివ పోలీసులకు పట్టుబట్టారు. వారి నుంచి 9 లిక్కర్ బాక్సులు (90 ఎంఎల్ 846 టేట్రా ప్యాకట్లు) స్కూటీని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రైతులకు ఇబ్బందిలేకుండా చర్యలు : ఎమ్మెల్యే బీవీ



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు , జూలై 16: విత్తనాలు, ఎరువులు, సాగునీరు వంటి విషయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అగ్రికల్చర్, ఇరిగేషన్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఏఏ పంటలు ఎంతమేరకు సాగు అయ్యాయి, రైతులకు విత్తనాలు, ఎరువులు సమృద్ధిగ అందుతున్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాసిరకం, నకిలి విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా దుకాణాలపై నిఘా పెంచాలని సూచించారు.

చినుకు రాలక..

మొక్క మొక్కకు నీరు

● పంటలను కాపాడుకునేందుకు రైతుల ఆరాటం



హలేబీడులో పంటకు నీరు పోస్తున్న రైతు కూలీలు



పెండేకల్ వద్ద టమోటా మొక్కలకు నీరు పోసి నాటుతున్న దృశ్యం

ఆలూరు/తుగ్గలి జూలై 16: వర్షం కురువకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. కంటికి కునుకు లేకుండా ఎదురుచూపులు చూస్తున్నారు. ఖరీఫ్‌లో విస్తారంగా కురిసి పంటలు పండితే కష్టాల నుంచి గట్టెక్క వచ్చని భావిస్తున్న రైతులు వర్షం జాడ లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేసిన పంటలు పెరగకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు నానాఅవస్థలు పడుతున్నారు. ఆలూరు మండలం హలేబీడు గ్రామంలో వెంకటేష్ అనే రైతు ఎకరా భూమిలో టమోటా నారు వేశారు. వర్షాలు లేకపోవడంతో చేసేదేమీ లేక రూ.1200 చెల్లించి ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకున్నారు. పంట ఎండిపోకుండా కూలీలను పెట్టి బకెట్లతో, బిందెలతో మొక్కమొక్కకూ నీరు పోస్తు పంటలను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే తుగ్గలి మండలంలోని పెండేకల్, ఎద్దులదొడ్డి, మారెళ్ల తదితర గ్రామాల్లో వేయి ఎకరాలకు పైగా టమోటా పంటను రైతులు సాగు చేశారు. వర్షాలు అరకొరగా పడుతుండటంతో పొలాలు పూర్తిగా పదును కాలేదు. దీంతో అదును తప్పుతుందని ట్యాంకర్లతో.. ఆటోలలో ఎద్దులబండ్లపైన నీటిని తెచ్చి మొక్క మొక్కకు నీరు పోసి నాటుతున్నారు.

ఘనంగా పెద్దసరిగెత్తు

పత్తికొండ/టౌన్, జూలై16: మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పెద్దసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. పత్తికొండలోని తేరుబజార్, బొగ్గులచావిడి, కొత్తపేట ప్రాంతాల్లో సుమారు 10 చావిళ్లలో పీర్లదేవుళ్లను కొలువుదీర్చారు. కులమతాలకు అతీతంగా ముస్లింలు, హిందువులు పీర్లదేవుళ్లకు మొక్కులను చెల్లించారు. కొందరు మొక్కుల్లో భాగంగా విచిత్రవేషధారణతో పట్టణంలో తిరుగాడారు. పులివేషదారులు పీర్లచావిళ్లముందు పులిఆటతో మొక్కులు తీర్చుకోవడంతో పాటు తమ ఆటతోప్రజలకు మొహర్రంవేడులను చూపారు. గుండాలవెలిగించి తెల్లవార్లు పీర్లచావిళ్లలో భక్తులు జాగారంచేశారు.



కమ్మరచేడులో పీర్ల చావిడిలో ప్రార్థనలు చేస్తున్న వీరభద్ర గౌడ్



పత్తికొండలో పులి వేషాల్లో భక్తుల సందడి

మొహర్రం వేడుకలను సోదర భావంతో జరుపుకోవాలి

ఆలూరు: మొహర్రం వేడుకలను సోదరభావంతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్రగౌడ్ సూచించారు. మంగళవారం రాత్రి ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామంలో కొలువుదీరిన పీర్ల దేవుళ్లను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట టీడీపీ యువనాయకులు గిరిమల్లేష్ గౌడ్ ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

మద్దికెర/గోనెగండ్ల : మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, గోనెగండ్ల, తుగ్గలి, రాంపల్లి, మామళ్లకుంట తదితర గ్రామాల్లో పెద్ద సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎం.అగ్రహారం గ్రామంలో పురుషులు మహిళల వేషాధారణ దుస్తులు ధరించి బోనాల సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. గోనెగండ్లలో మేళతాళలతో పీర్ల దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయ పీర్ల చావళ్ల ముందు సాహూసేన్, సద్‌సేన్ అంటూ అలాయిగుంత చుట్టూ చిందులు తొక్కారు.

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యేలు

హాలహర్వి : మండలంలో జరిగే మోహరం వేడుకల్లో ఎమ్మెల్యేలు, రాజకీయ నేతల సందడి నెలకొంది. పెద్ద సరగేత్త కార్యక్రమంలో ఆలూరు వీరుపాక్షి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, బళ్లారి మాజీ మేయర్ శశికళ, వైకుంఠం మల్లికార్జున చౌదరి, పాల్గొన్నారు. చక్కెరతో తూలాబారం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ సైతం పలు గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు.

రాతపూర్వక ఫిర్యాదుపై చర్యలు : ఎమ్మెల్యే పార్థసారథి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, జూలై 16: పట్టణంలో ఎలాంటి ఆక్రమణలు జరిగినా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఖచ్చితమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. పట్టణంలోని వివిధ మార్కెట్లకు సంబంధించిన వేలాలు నిర్వహించడానికి మంగళవారం కౌన్సిల్‌హాల్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు పట్టణంలో ట్రాఫిక్ పెరిగిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

వేలాలు వాయిదా

మంగళవారం జరగాల్సిన ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌తో పాటు పశువుల సంత, గొర్రెల సంత వేలాలు వాయిదా పడ్డాయి. మార్కెట్లకు సంభందించిన రుసుమును వసూలు చేయడానికి 8 నెలల సమయం మాత్రమే ఉండగా, సర్కారు పాటగా రూ.46 లక్షలు నిర్ణయించడం, కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను దూరంగా ఉన్న అగ్రికల్చరల్ మార్కెట్ యార్డులో నిర్వహిస్తుండటంతో తమకు నష్టం వాటిల్లుతుందని వేలంపాట దారులు తెలిపారు. హోల్‌సేల్ మార్కెట్‌ను తమ పరిధిలోకి తెస్తే వేలాలల్లో పాల్గొంటామని కాంట్రాక్టర్‌లు ముజీబ్, తిమ్మప్ప, బుద్దారెడ్డి, లక్ష్మీనారాయణ అన్నారు. హోల్ సేల్ మార్కెట్ తరలింపును పరిశీలిస్తానని ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి, ఆర్‌వో అస్లాం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఆలూరు సస్యశ్యామలం

హాలహర్వి, జూలై 16: ఆలూరు ప్రాంతం సస్యశ్యామలం కావలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ అన్నారు. మంగళవారం కామినహల్, బాపురం, గూళ్యం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో ఆలూరు అభివృద్ధిపై నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని, వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి మంజూరు చేయాలని కోరతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు రమేష్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమనాయుడు, చిన్న కృష్ణమనాయుడు, హాలహర్వి సర్పంచు మల్లికార్జున పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నాయకుడు దేవేంద్రప్ప

ఆదోని, జూలై 16: ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని టీడీపీ సీనియర్ నాయకులు దేవేంద్రప్ప కోరారు. మంగళవారం మంగళగిరిలోని మంత్రి లోకేశ్ బాబును కలిసి ఆదోని నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని కోరారు.

రహదారిలేక ఇబ్బందులు పడుతున్నాం

● ఎమ్మెల్యేను కలిసిన తిరుమల నగర్ వాసులు

ఎమ్మిగనూరు , జూలై 16: రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని రహదారి నిర్మించాలని తిరుమల నగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డిని కోరారు. మంగళవారం కాలనీలో క్లబ్ ప్రాంతంలో నివసిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగలతో పాటు టీచర్లు ఆంజనేయులు, నారాయణ,ఏఈ నాగేంద్రప్ప, ఎంకన్న, సత్యం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. ఇళ్ల నుంచి ప్రధాన రహదారికి రావాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పదేళ్లుగా ఇలాంటి కష్టాలు పడుతూనే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డిని పిలిచి పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోసారి కాలనీలో పర్యటిస్తానని చెప్పారు. అనంతరం కమీషనర్ గంగిరెడ్డి కాలనీవాసులతో మాట్లాడుతూ ఇప్పటికే రూ. 40లక్షలతో ఎల్ షేప్‌లో రహదారి నిర్మాణానికి ప్రతిపాధనలు పంపామని, టెక్నికల్ శాంక్షన్ కూడా మంజూరయ్యిందిని, త్వరలో టెండర్లు పూర్తి అయితే రహదారి నిర్మిణానికి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.

' శిలాశాసనాలను జాగ్రత్తగా కాపాడాలి'



అశోకుని శిలా శాసనాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

తుగ్గలి, జూలై 16: అశోకుని శిలా శాసనాలను జాగ్రత్తగా కాపాడాలని తహసీల్దార్ షర్మిళ అన్నారు. మంగళవారం జొన్నగిరి గ్రామ శివారులో ఉన్న అశోకుని శిలా శాసనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అశోకుడు నాటి కాలంలో ఎంతో శ్రమించి భావితరాల కోసం ఈ శిలా శాసనాలు వేశారని, వాటిని అర్థం చేసుకొని ఆదరించాలని, ఈ శాసనాలను కాపాడుకొని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని భద్రతా ఏర్పాట్లు చేసిందని వివరించారు. తహసీల్దార్ వెంట వీఆర్వో స్వరూప్, సిబ్బంది జొన్నగిరి బాబు తదితరులు ఉన్నారు.

నిక్కచ్చిగా తనిఖీ చేయండి

దేవనకొండ ,జూలై 16 : గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు జరిగిన ఉపాధి పనులపై నిక్కచ్చిగా తనిఖీలు నిర్వహించాలని ఎపీడీ పక్కీరప్ప, ఎస్ఆర్‌పీ అవులయ్య అన్నారు. దాదాపు రూ.12.68 కోట్లతో మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు జరిగాయన్నారు. జరిగిన పనులపై తనిఖీకి వచ్చే సిబ్బందికి ఫీల్డ్ అసిస్టెంట్‌లు సహకరించాలని సూచించారు. ఏపీఓ కృష్ణమూర్తి, ఏఈపీఆర్ ఏఈ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలుకార్డుతో భూయజమానికి ఇబ్బందులు ఉండవు

దేవనకొండ ,జూలై 16 : కౌలు రైతుకు కార్డు జారీతో భూ యజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండవని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి అన్నారు.మండలంలోని తెర్నేకల్ గ్రామంలో భూయజమానులు, కౌలు రైతులతో సమావేశంలో ఆమె మాట్లాడారు.కౌలుకార్డుతో భూ యజమానులకు ఏలాంటి నష్టాలు ఉండవని అపోహలు పడవద్దన్నారు.11నెలలు ఒప్పంద పత్రంతో భూయజమానలకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని , కౌలు కార్డుతో సాగు చేస్తున్న రైతుకి విత్తనాలు ,ఎరువులు విరివిగా లభిస్తాయన్నారు. మండలంలో 1270 కౌలు రైతులను గుర్తించాలన్నారు.తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టి , ఎఓ సురేష్‌బాబు ,సర్పంచు అరుణ్‌కుమార్ ,ఎఈఓ రంగన్న ,యోగేంద్ర ,విఎఎ ,తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ భర్తపై స్థానికులు ఆగ్రహం

ఎంపీపీ లక్ష్మిదేవి భర్త వైసీపీ నాయకుడు జిల్లా వ్యవసాయ అధికారి సమావేశంలో ఎంపీపీగా అధికారుల పక్కన కుర్చోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు ఎంపీపీ లక్ష్మిదేవమ్మ కాగా అధికారిక సమావేశంలో మీరేందుకు కుర్చున్నారంటూ వాదనకు దిగడంతో అక్కడి నుంచి ఆయన వెనుదిరిగారు.

అధికారులు మొద్దు నిద్ర వీడాలి : సీపీఎం

● కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంకులో నాయకుల బైఠాయింపు



ఎస్ఎస్ ట్యాంకు వద్ద బైఠాయించిన సీపీఎం నాయకులు

ఆదోని రూరల్ , జూలై 16 : ఆదోని మండలం కుప్పగల్లు ఫారెస్టు సమీపంలో ప్రజలకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ట్యాంకు ఎండిపోయి గ్రామాలకు గుక్కెడు నీళ్లు లేవని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న అన్నారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో కలిసి పలువురు ఎండిపోయిన ఎస్ఎస్ ట్యాంకులో బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంకు ఎండిపోయి 10రోజులైందని, దీంతో పెద్దతుంబళం, కుప్పగల్లు, బల్లేకల్లు, పాండవగల్లు, జాలిమంచి, గణేకల్లు, ఇస్వీ గ్రామాల ప్రజలకు తాగునీరు అందడం లేదని అన్నారు. సకాలంలో ఎల్లెల్సీ ద్వారా ఎస్ఎస్ ట్యాంకుకు నీరందించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు ఎల్లెల్సీకి నీరు వచ్చినప్పుడు ట్యాంకు నింపకపోవడంతో ఈ దుస్థితి దాపురించిందని వాపోయారు. ఇప్పటికీ కూడా అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదని, కనీసం తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న గ్రామాల ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు స్పందించాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, కృష్ణ, హుసేని, గోవిందు, వెంకటేష్, ఉరుకుందు, నర్సిరెడ్డి, ఆంజనేయ, రంగస్వామి, మంజునాథ, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భరోసా ఇవ్వడమే ఎన్ఎస్‌యూఐ లక్ష్యం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 16: విద్యార్థులకు, యువతకు భరోసా ఇవ్వడమే ఎన్ఎస్‌యూఐ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ కార్యదర్శి బల్లెకల్ నవీన్ అన్నారు. మంగళవారం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రజా స్వామ్యం, లౌకికవాదం, సమానత్వం వంటి విలువలతో కూడిన బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఈ సంఘాన్ని స్థాపించారని పేర్కొన్నారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడిగా బాలకృష్ణ, కార్యదర్శిగా వంశీ, సహాయ కార్యదర్శిగా బాబు, చంద్ర, తిప్పేశ్ ఉపాధ్యక్షులుగా నవీన్‌లను ఎన్నుకున్నారు.

శాకాంబరి అవతారంలో అంబాభవాని

ఆదోని (అగ్రికల్చర్), జూలై 16: కట్టడంలోని కలిచిలిపేట అంబాభవాని దేవాలయంలో ఆషాడ మాసం పురస్కరించుకొని అంబాభవాని అమ్మ వారు శాఖాంబరి అవతారంలో మంగళవారం భక్తులకు దర్శనమించారు. 21 రకాల కూరగాయలతో అమ్మవారిని, నవగ్రహ, పరమేశ్వరునికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 16: మొహర్రం వేడుకల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల, సిరాలదొడ్డి, రాళ్లదొడ్డి, మసీదుపురం, గుడికల్లు తదితర గ్రామాల్లో జరిగే మొహర్రం వేడుకలను సామరస్యంగా జరుపుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 16: రాజమండ్రిలో ఈ నెల 20న జరిగే ఏఐకెఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న కోరారు. మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. రాజమండ్రిలో జరిగే ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్‌కౌన్సిల్‌లో రైతుల పట్ల ప్రభుత్వాలు అవలంభిస్తున్న నిర్లక్ష్యంపైన, పంటల గిట్టుబాటు ధరపైన ఈ సమావేశాల్లో చర్చిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి రైతులు, రైతు సంఘాల నాయకులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామలింగయ్య, రంగన్న, ఈరన్న, రామకృష్ణ, నాగేంద్ర, జన్నప్ప, మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాపర్‌వైర్‌ను దొంగలించిన దుండగులు

పెద్దకడుబూరు , జూలై 16: పెద్దకడుబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో ఈ నెల 4న పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్‌వైర్‌ను దొంగలు దొంగలించినట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాలవాడి గ్రామానికి చెందిన వేణుగోపాల్ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందన్నారు గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్‌ను ఎత్తికెళ్లారని తెలిపారు.

కౌలు రైతులు కార్డులు తీసుకోవాలి

పెద్దకడుబూరు , జూలై 16: మండలంలోని కౌలు రైతులు తమ కౌలు కార్డులను తీసుకోవాలని ఏవో వరప్రసాద్ తెలిపారు. మంగళవారం హెచ్.మురవణిలో కౌలు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. కౌలు రైతులు కౌలు కార్డు తీసుకోవడం వలన ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులు అవుతారన్నారు. భూమి యజమానులు కౌలు రైతులకు పాసుపుస్తకాల జిరాక్స్‌లను అందజేయడం వలన ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. వీఆర్వో విక్రమ్‌రెడ్డి, టీడీపీ నాయకులు సత్యన్నగౌడు, శివ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్, జూలై 16: ఎల్లార్తి గ్రామంలోని షేక్షావలి, షాషావలి దర్గాకు చెందిన వక్ఫ్ బోర్డు అధికారి రెహమాన్‌పై దాడిచేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్ అహమ్మద్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దర్గా నిర్వహణ పగ్గాలు తమ చేతులలోకి తీసుకోవడానికి కొందరు చక్రం తిప్పుతున్నారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హాస్టళ్లను పునరుద్దరించాలి

దేవనకొండ ,జూలై 16 : దేవనకొండలోని డిఎస్సీ హాస్టల్ ,తెర్నేకల్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లను పునరుద్దరించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ విద్యకోసం ఖర్చుపేట్టే స్తోమత లేని పిల్లల చదువులు మధ్యలో ఆగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల అధ్యక్షకార్యదర్శులు మధు,భాస్కర్ విష్ణు ,అరవింద్ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

మద్దికెర, జూన్ 16: మండలంలో కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని లెప్రసి నోడల్ ఆఫీసర్ కృష్ణమ్మ ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. మంగళవారం మద్దికెరలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా ఉన్నారు.

అందరికీ న్యాయం చేయాలి

మద్దికెర, జూన్ 16: మండలంలో తెలుగుదేశం కూటమి విజయం కోసం ఐదేళ్లు పని చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చూసుకున్నారనీ పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు ఆవుల పెద్దన్న, మాజీ ఎంపీటీసీలు సుధాకర్ చౌదరి, శివశంకర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విఠోబ, తెలుగుదేశం పార్టీ నాయకులు మెడికల్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మద్దికెరలో తెలుగుదేశం పార్టీ కోసం పని చేశామని అన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అందరినీ గుర్తిస్తారని తెలిపారు.

యువకుడి అదృశ్యం

ఎమ్మిగనూరు , జూలై 16: ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన శివకుమార్ (29) అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలుగు భీమన్న, మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. రెండు నెలల క్రితం శివకుమార్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లతో పాటు ఇతర ప్రాంతాల్లో వెతికినా దొరకలేదు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. శివకుమార్ కు కొంతమేర మతిస్థిమితం లేకుండా ఉంటాడని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 70132 80193, 63029 65353 నంబర్లను సంప్రదించాలని కోరారు.

18న 10వేల మొక్కలు నాటే కార్యక్రమం

ఎమ్మిగనూరు టౌన్,జూలై 16 : పట్టణ సుందరీకరణలో బాగంగా ఎమెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల18న మైనార్టీ కాలనీలో 10వేల మొక్కలు నాటే కార్యక్రమం చెపడుతున్నట్లు మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం కమిషనర్ మైనార్టీకాలనీలో పర్యటించి మొక్కలు ఎక్కడెక్కడ నాటాలి.. ఎన్ని మొక్కలు నాటాలి తదితర అంశాలను పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.